నమస్తే తెలంగాణ
వికారాబాద్
13 | హైదరాబాద్, ఆదివారం 24 మార్చి 2024 | VIKARABAD

# భువనగిరి బరిలో క్యామ మల్లేశ్



- బీఆర్ఎస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థిగా ప్రకటించిన కేసీఆర్
- బీసీ వర్గాల్లో మంచి పట్టున్న నేత..
- పంచాయతీ సభ్యుడి నుంచి పార్లమెంట్ అభ్యర్థి వరకు అతడి ప్రస్థానం

ఇబ్రహీంపట్నం, మార్చి 23 : భువనగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థిగా ఇబ్రహీంపట్నానికి చెందిన క్యామ మల్లేశ్ బరిలో నిలువనున్నారు. ఈ మేరకు శనివారం పార్టీ అధినేత కేసీఆర్ ప్రకటించారు. అన్ని రకాలుగా ఆలోచించిన అధిష్ఠానం చివరిగా క్యామ మల్లేశ్ వైపే మొగ్గు చూపింది. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలోని శేరిగూడ గ్రామానికి చెందిన క్యామ మల్లేశ్ ముందుగా కాంగ్రెస్ పార్టీలో అనేక పదవులు అధిరోహించారు. మార్కెట్ కమిటీ చైర్మన్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా పనిచేశారు. 2014లో ఇబ్రహీంపట్నం నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసి ఓటమి పాలైన ఆయన 2018లో బీఆర్ఎస్‌లో చేరారు. అప్పటినుంచి పార్టీలో క్రమశిక్షణ కలిగిన నాయకుడిగా పనిచేస్తూ పార్టీ అధినేత కేసీఆర్ మన్ననలు పొందుతున్నారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గంతో పాటు ఆయనకు బీసీ వర్గాల్లో మంచి పట్టున్నది. ఆయన కుటుంబానికి రాజకీయ నేపథ్యం లేకపోయినప్పటికీ పోరాట పటిమ కలిగిన నాయకుడిగా తన కంటూ ప్రత్యేక గుర్తింపును తెచ్చుకున్నారు. బీసీల అభ్యున్నతి కోసం ఎంతగానో కృషి చేశారు. మల్లేశ్ స్వగ్రామమైన శేరిగూడలో మొదటిసారిగా పంచయతీ సభ్యుడిగా పోటీచేసి గెలుపొందారు. అనంతరం ఆయన స్వశక్తితో అనేక పదవులు నిర్వహించటంతో పాటు ప్రతి పనిలోనూ మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఆయన నమ్మిన సిద్ధాంతం కోసం కష్టపడి పనిచేసే గొప్ప నాయకుడిగా పేరున్నది.

### బీఆర్ఎస్‌తోనే సామాజిక న్యాయం..

బీఆర్ఎస్‌తోనే అన్ని వర్గాల వారికి సామాజిక న్యాయం జరుగుతుందని బీఆర్ఎస్ భువనగిరి పార్లమెంట్ అభ్యర్థి క్యామ మల్లేశ్ అన్నారు. పార్టీ అధినేత కేసీఆర్ ఆయన పేరును ప్రకటించిన నేపథ్యంలో 'నమస్తేతెలంగాణ'తో మాట్లాడారు. అన్ని వర్గాల వారికి రాజ్యాధికారం దక్కాలన్న ఉద్దేశంతో పార్టీ అధినేత కేసీఆర్ తన అభ్యర్థిత్వాన్ని ప్రకటించారన్నారు. భువనగిరి పార్లమెంట్ పరిధిలో బీఆర్ఎస్ బలంగా ఉందన్నారు. పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకుని వారందరి సహకారంతో భువనగిరిలో బీఆర్ఎస్ జెండా ఎగురవేస్తామన్నారు. కొంతమంది అవకాశవాదంతో పార్టీని వీడుతున్నారని, అలాంటివారితో పార్టీకి జరిగే నష్టమేమీ లేదన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎంతో నమ్మకంతో తనకు సీటు కేటాయించారన్నారు. బీఆర్ఎస్ పార్టీతోనే బడుగు, బలహీన వర్గాలకు సమన్యాయం లభిస్తుందని అన్నారు. కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి బీఆర్ఎస్‌ను విజయతీరాలకు చేరుస్తామన్నారు. ముఖ్యంగా వెనుకబడిన తరగతులవారికి సామాజిక న్యాయం అందాలంటే బీఆర్ఎస్‌ను గెలిపించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

### బయోడేటా...

పేరు : క్యామ మల్లేశ్..
భార్య : క్యామ జంగమ్మ..
కుమారుడు : అంజన్‌కుమార్,
కుమార్తెలు : ప్రియాంక, అవంతి, అరోణి,
స్వగ్రామం : శేరిగూడ, ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ...
ప్రస్తుత నివాసం : వనస్థలిపురం.
విద్యార్హతలు : ఇంటర్మీడియట్ పాస్..
నిర్వహించిన పదవులు : 1992లో ఇబ్రహీంపట్నం మార్కెట్‌కమిటీ చైర్మన్, 2003లో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా బాధ్యతలు, అలాగే, మండల యూత్ కాంగ్రెస్, మండల కాంగ్రెస్ అధ్యక్ష పదవులు నిర్వహించారు.
2014లో ఇబ్రహీంపట్నం నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ, 2018లో బీఆర్ఎస్‌లో చేరిక....



# కాంగ్రెస్ పాలనలో... కరెంటు పోయింది.. కరువు వచ్చింది

బీఆర్ఎస్‌కు జై కొడుతున్న అభ్యర్థి జ్ఞానేశ్వర్, ఎమ్మెల్సీ వాణీదేవి, ఎమ్మెల్యేలు సబితారెడ్డి, యాదయ్య, ప్రకాశ్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు ఆనంద్, మహేశ్‌రెడ్డి తదితరులు

**మన ప్రాంతానికి సాగునీటిని తీసుకొద్దామనే ఆలోచనే రేవంత్‌కు లేదు**

**బడుగుల గొంతుక పార్లమెంట్‌లో వినిపించాలంటే కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించాలి**

**మాజీ మంత్రి, ఎమ్మెల్యే పి.సబితా ఇంద్రారెడ్డి**



పరిగి, మార్చి 23 : కాంగ్రెస్ వచ్చింది కరెంటు పోయింది, కరువు వచ్చిందని ప్రజలు బాధపడు తున్నారని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితాఇంద్రారెడ్డి అన్నారు. కేసీఆర్ రైతు బంధు, రైతుబీమా, కేసీఆర్‌కిట్, మిషన్ భగీరథ ద్వారా తాగునీరు ఇచ్చి పేదలకు మేలు చేస్తే.. అంతకంటే బాగా చేస్తారేమోనని కాంగ్రెస్‌ను నమ్మి ఎన్నికల్లో గెలిపిస్తే మమ్మల్ని నట్టేట ముం చారని ప్రజలు వాపోతున్నారన్నారు. పరిగిలో శనివారం మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. చేవెళ్ల అభ్యర్థులుగా బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నుంచి ప్రస్తుతం బరిలో ఉన్న ఇద్దరికి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తోనే గుర్తింపు వచ్చిందన్నారు. విశ్వేశ్వర్‌రెడ్డి, రంజిత్‌రెడ్డిలను గత ఎన్నికల్లో బీఆర్ఎస్ శ్రేణులు కష్టపడి గెలిపించారని గుర్తు చేశారు. అభ్యర్థిగా ప్రకటించిన త ర్వాత రంజిత్‌రెడ్డి ఎందుకు పార్టీ మారారో తెలియదని...కానీ బీఆర్ఎస్ నాయకులు, కార్య కర్తల శక్తిని తక్కువగా అంచనా వేసి పార్టీ వీడిన వారికి మన శక్తి చూపించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. రంజిత్‌రెడ్డి అంటే ఎవరో కూడా ప్రజలకు తెలియదని.. అలాంటి వ్యక్తికి కేసీఆర్ ఎంపీ టికెట్ ఇచ్చి గెలిపించారన్నారు. ఈ లోక్‌సభ ఎన్నికలను బీఆర్ఎస్ శ్రేణులు ఓ చాలెంజ్‌గా తీసుకుని కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. ఈ ప్రాంతానికి చెందిన వ్యక్తి ముఖ్యమంత్రిగా ఉన్నారని, మన ప్రాంతం గురించి ఏమైనా మాట్లాడుతారని వంద రోజులుగా చూస్తున్నా ఫలితం లేదన్నారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు దాదాపుగా పూర్తైందని.. త్వరగా కాల్వలు తవ్వి మన ప్రాంతానికి సాగు నీటిని తీసుకొద్దామనే ఆలోచన సీఎంకు లేదన్నారు. మైకు పట్టుకుంటే చాలు కేసీఆర్‌ను తిట్టడమే పనిగా పెట్టుకున్నారన్నారు. గతేడాది డిసెంబర్ 9న వికారాబాద్ చౌరస్తాలో నిలబడి రూ.2 లక్షల వరకు పంట రుణాలను మాఫీ చేస్తామని రేవంత్‌రెడ్డి ప్రకటించారని, ఆ హామీని ఇంకా ఎందుకు అమలు చేయడంలేద ని ప్రశ్నించారు. బీజేపీ వారు జైశ్రీరామ్ అంటుండగా.. కాంగ్రెస్ వారు గేట్లు ఎత్తుతామంటు న్నారని.. సీఎం రేవంత్‌రెడ్డి కండువాలు వేసి మురిసిపోతున్నారని ఎద్దేవా చేశారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీల అభ్యర్థులు ఈ ఎన్నికల్లో గెలిస్తే మనల్ని నిర్లక్ష్యం చేస్తారని.. బడుగుల గొంతు పార్లమెంట్‌లో వినిపించాలంటే జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. బీఆర్ఎస్ అభ్యర్థి జ్ఞానేశ్వర్‌కు పరిగి, వికారాబాద్, తాండూరు అంటే ఎనలేని ప్రేమ అని, ఆయన జడ్పీచైర్మన్‌గా ఉన్నప్పుడు ఈ ప్రాంతాల అభివృద్ధికి ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పరిగి మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డికి ఫోన్ చేసి మనవాళ్లు ఏమంటున్నారని అడిగితే.. 'మొదటి సమావేశాన్ని పరిగిలోనే ఏర్పాటు చేయాలని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించేందుకు అందరూ సిద్ధంగా ఉన్నారని చెప్పారని' అన్నారు. పరిగి ప్రాంతంలోని అన్ని వర్గాల వారితో జ్ఞానేశ్వర్‌కు మంచి సంబంధాలున్నాయని, సేవాగుణంలో ఆయన ముందుంటారని కొనియాడారు. ప్రజానాయకుడు కాసాని జ్ఞానేశ్వర్‌ను చేవెళ్ల పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థిగా ప్రకటించినందుకు కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు. జ్ఞానేశ్వర్‌ను అభ్యర్థిగా ప్రకటించగానే బడుగు, బలహీన వర్గాల నుంచి మద్దతు లభిస్తున్నదన్నారు. జ్ఞానేశ్వర్ చేసిన సేవలకు రుణం తీర్చుకోవడంతోపాటు ఆయనను గెలిపించి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు బహుమతిగా ఇద్దామని సబితారెడ్డి బీఆర్ఎస్ శ్రేణులకు సూచించారు. ప్రతి గ్రామంలో గత అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన ఓట్లు వాటిని ఎలా పెంచుకోవాలనే దానిపై దృష్టి పెడితే తప్పనిసరిగా బీఆర్ఎస్ అభ్యర్థి విజయం ఖాయమన్నారు. సమావేశానికి వచ్చిన ప్రతి కార్యకర్త వంద మం దిని ప్రభావితం చేయాలని.. బీఆర్ఎస్ అభ్యర్థి గెలుపునకు బీఆర్ఎస్ శ్రేణులు రెండు నెలలపా టు ప్రజా క్షేత్రంలోనే ఉండాలన్నారు. బీఆర్ఎస్ పార్టీ పని అయిపోయిందని మాట్లాడే వారిపై మండిపడ్డారు. సూర్యాచంద్రులు ఉన్నంత కాలం, తెలంగాణ రాష్ట్రం ఉన్నంత కాలం కేసీఆర్ పేరు పలుకుతూనే ఉంటారన్నారు. ప్రాణాన్ని లెక్క చేయకుండా రాష్ట్రాన్ని సాధించిన ధీరుడు కేసీఆర్ అని సబితారెడ్డి కొనియాడారు. కార్యక్రమంలో జడ్పీటీసీలు కొప్పుల నాగారెడ్డి, హరిప్రియ, మలిపెద్ది మేఘమాల, రాందాస్‌నాయక్, శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీలు కరణం అరవిందరావు, మల్లేశం, మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్, పీఏసీఎస్ చైర్మన్ కొప్పు ల శ్యాంసుందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు కాసాని వీరేశ్, గణేశ్ గుప్తా, సురేందర్, ఆంజనేయులు, సుధాకర్‌రెడ్డి, రాజేందర్, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, సుభాష్‌చందర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, రాంచంద్రయ్య, అజహర్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### కేసీఆర్ పాలనలోనే అన్ని వర్గాలకు మేలు

కేసీఆర్ పాలనలోనే అన్ని వర్గాలకు మేలు జరిగింది. పదేండ్ల పాలనలో ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందాయి. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో చేవెళ్ల అభ్యర్థిగా కేసీఆర్ నిర్ణయించిన జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుందాం. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా అభివృద్ధికి ఆయన ఎంతో కృషి చేశారు.

**-కాలె యాదయ్య, చేవెళ్ల ఎమ్మెల్యే**



### రానున్న రోజుల్లో పూర్వవైభవం పక్కా..



పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు పట్టించుకోకుండా వెళ్లిపోతున్న వారిని భవిష్యత్తులో తిరిగి చేర్చుకోరాదు. పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఎంతో మంది లైన్లు కట్టారు.. ప్రస్తుతం పార్టీని వీడడం సమంజసం కాదు. పార్టీ కన్న తల్లి లాంటిది. ఎంతోమంది నాయకులను కేసీఆర్ తయారు చేశారు. కష్టకాలంలో అండగా ఉన్న వారే నిజమైన కార్యకర్తలు. రానున్న రోజుల్లో బీఆర్ఎస్‌కు పూర్వ వైభవం కచ్చితంగా వస్తుంది.

**-మెతుకు ఆనంద్, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే**

### కేసీఆర్‌కు బహుమతిగా ఇద్దాం..



ఆశీర్వదించి గెలిపిస్తే ప్రజలకు అండగా ఉంటా. పార్లమెంట్‌లో తెలంగాణ వాణిని వినిపిస్తా. కేసీఆర్ పాలనలో ప్రజలకు మంచి పనులు జరిగాయి. సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ఇంటింటికీ చేరాయి. రంగారెడ్డి, వికారాబాద్ జిల్లా ల ప్రజలతో మంచి సంబంధాలున్నాయి. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు రెండు నెలలపా టు ప్రజాక్షేత్రంలో ఉండాలి. చేవెళ్లలో భారీ మెజార్టీతో విజయం సాధించి పార్టీ అధినేత కేసీఆర్‌కు బహుమతిగా ఇద్దాం. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచే కరెంట్ కష్టాలు మొదలయ్యాయి. బీఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధిని వివరిస్తూ ప్రజల్లోకి దూసుకెళ్తాం.

**-కాసాని జ్ఞానేశ్వర్, బీఆర్ఎస్ పార్టీ చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థి**

### బీజేపీ, కాంగ్రెస్‌లకు అభ్యర్థులే లేరు..



దేశంలోని ప్రాంతీయ పార్టీలను నామరూపాల్లేకుండా చేయాలనే అజెండాను బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు పెట్టుకున్నాయి. బీజేపీ, కాంగ్రెస్‌లకు అభ్యర్థుల్లేక బీఆర్ఎస్ నాయకులను తీసుకెళ్లి టికెట్లు ఇస్తున్నారు. నేడు అధికారం కోసం.. స్వలాభం కోసం పార్టీ మారిన నాయకులకు రానున్న ఎన్నికల్లో గట్టిగా బుద్ధి చెప్పాలి. అందుకు కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి. ఆయన జడ్పీ చైర్మన్‌గా, ఎమ్మెల్సీగా ఈ ప్రాంత అభ్యున్నతికి ఎంతో కృషి చేశారు. వ్యక్తిగతంగా అనేక మందిని ఆదుకున్నారు. అధికారంలోకి వచ్చి వంద రోజులైనా ప్రజల సమస్యలను పరిష్కరించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైనది. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫ ల్యాలే తమ అస్త్రాలు చేసుకుని ప్రజల్లోకి వెళ్లాలి.

**-కొప్పుల మహేశ్‌రెడ్డి, పరిగి మాజీ ఎమ్మెల్యే**

### పదేండ్లలో ఆనందంగా ప్రజలు..



పదేండ్ల కేసీఆర్ పాలనలో ప్రజలు ఆనందంగా ఉన్నారు. నిరంతరం నాణ్యమైన విద్యుత్తును అందించిన ఘనత కేసీఆర్‌కే దక్కింది. కాంగ్రెస్ వంద రోజుల పాలనలో ప్రజలు కరెంటు కష్టాలు పడుతున్నారు. మన ప్రాంతం వారు కాకున్నా రంజిత్‌రెడ్డిని గెలిపించుకున్నాం. పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఆయన ఎప్పుడు చూసినా కేసీఆర్, కేటీఆర్ దగ్గరే ఉండేవారు. అధికారం కోల్పోగానే పార్టీ మారడం ఎంతవరకు సమంజసం. బీఆర్ఎస్ శ్రేణులు కష్టపడి పనిచేసి రానున్న ఎన్నికల్లో బీసీ నాయకుడైన కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించాలి

**- ప్రకాశ్‌గౌడ్, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే**

### ప్రతి మనిషికీ విలువనేది ఉండాలి : ఎమ్మెల్సీ వాణీదేవి



ఎవరి నుంచైనా సాయం పొందినప్పుడు విశ్వాసంతో ఉండాలి. విశ్వాసం లేని బతుకు అదేం బతుకు. పార్టీ ఓడిపోయిన వెంటనే అధికారం అనుభవించిన వారు పార్టీ మారడం సరికాదు. రంజిత్‌రెడ్డి ఎవరో కూడా ప్రజలకు తెలియదు.. అలాంటి వ్యక్తికి కేసీఆర్ ఎంపీ టికెట్ ఇచ్చి గెలిపించడంతోపాటు.. సునీతారెడ్డిని రెండు పర్యాయాలు జడ్పీ చైర్‌పర్సన్‌గా, మహేందర్‌రెడ్డికి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, మంత్రిగా అవకాశం కల్పించారు. అలాంటి వారు పార్టీ మారడం ఎం తవరకు సమంజసం. ప్రతి మనిషికీ విలువ అనేది ఉండాలి. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రంలో ఎంతో అభివృద్ధి జరిగింది. గెలుపోటములు ఎవరి చేతుల్లో లేవు. బీఆర్ఎస్ శ్రేణులు సైనికులవలె పనిచేసి చేవెళ్ల ఎంపీగా జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి.



సమావేశానికి హాజరైన బీఆర్ఎస్ శ్రేణులు



కుండలను తీసుకెళ్లేందుకు వస్తున్న యువకులను కొడుతున్న మహిళలు(ఫైల్)

సండే స్పెషల్
SUNDAY SPECIAL

# హోలీ ఆడితేనే.. మగపిల్లల పెండ్లి!

- తండాల్లో అనాదిగా గిరిజనుల ఆచారం
- హోలీ రోజున 'దూండ్' పేరుతో ప్రత్యేక కార్యక్రమం
- పెండ్లీడుకొచ్చిన మగపిల్లలలు 'దూండ్' జరుపుకోవాల్సిందే..
- లేకుంటే యువకులకు పెండ్లి కాదని తండావాసుల నమ్మకం



తాళ్లతో కట్టి ఉంచిన పాయసం కుండలు(ఫైల్)

బొంరాస్‌పేట, మార్చి 23 : మనదేశంలో పండుగలను ఒక్కో ప్రాంతంలో ఒక్కో మతం, కులం వారు విభిన్న రీతిలో జరుపు కొంటుంటారు. ఈ విధంగా జరుపుకొనే పండుగలు వారి ఆచార సంప్రదాయాలను ప్రతిబింబిస్తాయి. అలాంటి వేడుకే హోలీ రోజున లంబాడాలు 'దూండ్' పేరుతో జరుపుకొనే హోలీ పండుగ. సాధారణంగా పెండ్లీడుకొచ్చిన ఆడపిల్లలు మంచి వ్యక్తితో తమ వివాహం జరుగాలని కాంక్షిస్తూ ప్రత్యేక పూజలు చేస్తారు. హైందవ మతంలో ఇది ఒక ఆచారం. కానీ గిరిజనులకు చెందిన లంబాడా తెగవారు తమ మగ పిల్లలకు పెండ్లి కావాలంటే తప్పక హోలీ ఆడాల్సిందే. హోలీ ఆడితేనే మగపిల్లలకు పెండ్లి అవుతుందని వారు నమ్ముతారు. ఇది లంబాడా జాతిలో అనాదిగా వస్తున్న ఆచారం. అదే ఆచారాన్ని నేటికీ గిరిజనులు ఆచరిస్తున్నారు. బొంరాస్‌పేట మండలంలోని పలు గిరిజన తండాల్లో హోలీ పండుగ వచ్చిందంటే చాలు గిరిజనులు తమతండాల్లోని మగపిల్లలు పెండ్లి కావాలని ఆకాంక్షిస్తూ 'దూండ్'ను జరుపుకొంటారు. దూండ్ చేయకపోతే యువకులకు పెండ్లిళ్లు కావని వారి నమ్మకం. దూండ్ అంటే తండాలోని ప్రతి ఇంటి ముందు పాయసం వండిన కుండలను కర్రలకు కడుతారు. ఆ విధంగా కట్టిన పాయసం కుండలను తండాల్లోని పెండ్లీడుకు వచ్చిన యువకులు ఎత్తుకెళ్లి తినాలి. ఈ సమయంలో మహిళలు యువకులను కట్టెలతో కొడుతారు. ఎంత కొట్టినా భరించి యువకులు వాటిని ఎత్తుకెళ్లాలి. ఈ కార్యక్రమం సుమారు గంటకుపైగా నిర్వహిస్తారు. బిందెలలో ఉన్న పాయసాన్ని ఎత్తుకెళ్లి తిన్న తరువాత యువకులు, యువతులు, చిన్నా పెద్దా అంతా కలిసి ఉత్సాహంగా రంగులు చల్లుకుని హోలీని జరుపుకొంటారు. మహిళలు ఉత్సాహంగా నృత్యాలు చేస్తారు. ఆ తరువాత బంధువులతో కలిసి సామూహికంగా భోజనాలు చేస్తారు. దూండ్ వేడుకల్లో తండా ప్రజలంతా ఉత్సాహంగా పాల్గొంటారు.



ఉత్సాహంగా హోలీ ఆడుతున్న మహిళలు(ఫైల్)

# కాంగ్రెస్ మీటింగ్‌లో డబ్బుల లొల్లి

## ఎన్నికల కోడ్ ఉల్లంఘన.. ఇన్ముల్‌నర్వలో డబ్బుల పంపిణీ

కొత్తూరు, మార్చి 23: రెండు ఎన్నికల నోటిఫికేషన్లకు సంబంధించిన కోడ్ ఉన్నా కాంగ్రెస్ నాయకులు లెక్క చేయడంలేదు.ఈ నెల 28న పట్టభద్రుల ఎన్నిక జరుగనున్నది. దీంతోపాటు ఎంపీ ఎన్నికల నోటిఫికేషన్ కూడా వచ్చింది. అయితే కాంగ్రెస్ నాయకుల ఇవేమీ లెక్క చేయకుండా పట్ట పగలే బహిరంగంగా డబ్బులు పంచుతూ మీడియాకు దొరికిపోయారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు పాల్పడుతున్నా అధికారులు చూసీచూడనట్లు వదిలేస్తున్నారు. మహబూబ్‌నగర్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి వంశీచంద్‌రెడ్డి కొత్తూరు మండలంలోని జేపీ దర్గాలో శుక్రవారం ఇఫ్తార్ విందు ఇచ్చారు. అయితే పనిలో పనిగా ఇన్ముల్‌నర్వలో ఓ చిన్నపాటి సభను ఏర్పాటు చేశారు. ఇందుకోసం డబ్బులు ఇస్తామని జనాన్ని పోగు చేశారు. ముందుగా ఇన్ముల్‌నర్వలో మీటింగ్ ముగించుకొని ఆ తర్వాత జహంగీర్ పీర్ దర్గాలో ఇఫ్తార్ విందుకు వెళ్లారు. అయితే పట్ట పగలే జనానికి డబ్బులు పంచుతూ అడ్డంగా మీడియాకు దొరికిపోయారు. సభకు వచ్చిన మహిళలకు అరకొరగా డబ్బులు పంచడంతో లొల్లి మొదలయింది. ఇచ్చిందే అరకొర అందులో వచ్చిన వారిలో కొంత మందికే ఇవ్వడంతో అందరికీ ఇవ్వాలని మహిళలు గొడవ పెట్టుకున్నారు.



మహిళలకు డబ్బులు పంచుతున్న కాంగ్రెస్ నాయకులు